ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

L.K.R COLLEGE OF NURSING
(Affiliated to Dr. N.T.R U.H.S Vijayawada)
Near J.V.R.R. ITI, V.C. Colony, Nandyal - 518502
అడ్మిషన్లు జరుగుచున్నవి
4 సం॥ల B.Sc., నర్సింగ్ కోర్స్,
అర్హత: ఇంటర్ Bi.P.C., మరియు ఒకేషనల్ నర్సింగ్ పాస్ అయిన విద్యార్థినీ, విద్యార్థులు EAPCET అర్హత సాధించిన వారు అర్హులు.
(మేనేజ్‌మెంట్ కోటా నందు కొన్ని సీట్లు కలవు)
పూర్తి వివరములకు:
85200 10739, 85200 23866
జె.లక్ష్మికాంత రెడ్డి, చైర్మన్

పేజీలు : 4 | సంపుటి : 01 | - సంచిక 178 | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సోమవారం 30- 9 - 2024 | వెల - 2 | Digital Edition

## పండుగలకు చేనేత వస్త్రాలనే ధరిద్దాం..నేతన్నలను ఆదరిద్దాం



**అమరావతి (రిపబ్లిక్ న్యూస్) :** పండుగలకు చేనేత వస్త్రాలనే ధరిద్దామని..నేతన్నలను ఆదరిద్దామని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. నారా భువనేశ్వరి పిలుపు మేరకు చేనేతలకు అండగా నిలబడదామని పిలుపునిచ్చారు. పండుగలకు చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలను ఆదరించాలని హోంమంత్రి వంగలపూడి అనిత కోరారు.

ఏపీ సచివాలయంలో హోంమంత్రి అనిత ఇవాళ(ఆదివారం) మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ... ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పిలుపు మేరకు తెలుగు ప్రజలు చేనేతలకు అండగా నిలవాలని హోంమంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు.ఒంట్లో నరాలను దారాలుగా పోగు చేసి కష్టపడి..రక్తంతో రంగులు అద్దుతూ చెమటోడ్చే చేనేతల బతుకు చిత్రం మార్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.

-మిగతా2లో



# రైతుల నడ్డి విరుస్తున్న దుర్గా భవానీ ?

- పర్టిలైజర్ అమ్మకాల్లో ఆయన చెప్పిందే వేదం.. ఆయన చేసేదే శాసనం
- నంద్యాల జిల్లాలో విస్తరించిన ఆయన వ్యాపార సామ్రాజ్యం
- నంద్యాల,బండి ఆత్మకూరు,సంత జుటూరు,వెలుగోడు,గడివేములలో దుకాణాల ఏర్పాటు
- ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తు రైతుల నడ్డి విరుస్తున్న వైనం
- రైతులు అడిగిన ఎరువులు ఇవ్వాలంటే ఆయన షాపులో అమ్ముడు పోకుండ మిగిలిన మందులు కొనాల్సిందే ?
- ఆయనకు వ్యవసాయ జిల్లా అధికారులన్న లెక్కే లేదు
- ఎందుకంటే సతీమణి, అల్లుడు ఇరువురు డిప్యూటీ తహసీల్దార్ల అండ ఉన్నారనే ధైర్యం
- వారి అండతోనే రైతుల పై చిన్న చూపు

నంద్యాల,సెప్టెంబర్ 29, (రిపబ్లిక్ న్యూస్)

వివరాలు 2లో

## అనధికార స్థలాలకు పర్మిషన్ ఇచ్చిన అధికారులపై చర్యలు..

**మూసీ ఆక్రమణలో ఉన్నవారికి డబుల్ బెడ్రూం ఇళ్లు: మంత్రి శ్రీధర్ బాబు**

**మూసీలో మంచి నీరు ప్రవహించాలని తాము ప్రయత్నం చేస్తున్నామని శ్రీధర్ బాబు తెలిపారు.**



హైడ్రా కూల్చివేతలపై తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు కీలక విషయాలు తెలిపారు. ప్రజలను రెచ్చగొట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని అన్నారు. చెరువుల రక్షణ కోసం తమ ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు.

మూసీ ఆక్రమణలో ఉన్న ప్రతి ఇక్కరికి ప్రత్యామ్నాయ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. పేదలకు కాంగ్రెస్ ఎన్నడూ అన్యాయం చేయలేదని, ఎప్పటికీ చేయబోదని అన్నారు. మూసీ ఆక్రమణలో ఉన్న పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు.మూసీలో మంచి నీరు ప్రవహించాలని తాము ప్రయత్నం చేస్తున్నామని శ్రీధర్ బాబు తెలిపారు.

-మిగతా2లో

# నగరంలో అంధకారం

- వెలగని వీధి దీపాలు
- రోడ్లపై చీకటిరాజ్యం
- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, నేరాలు
- జీవీఎంసీకి ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- నోటీస్ ఇచ్చామన్న కమిషనర్
- రెండు నెలల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ



**విశాఖపట్నం(రిపబ్లిక్ న్యూస్)** నగరంలో చీకటిపడితే అంధకారం రాజ్యమేలుతోంది. దాదాపు సగం వీధి దీపాలు వెలగకపోవడంతో వీధుల్లోనూ, ప్రధాన రోడ్లపైనా చీకట్లు అలముకుంటున్నాయి. ఇది రోడ్డు ప్రమాదాల పెరుగుదలకు కారణమవుతోంది. అదేవిధంగా నేరగాళ్లకు అవకాశంగా మారుతోంది. వీధి దీపాల సమస్యపై ఎవరు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం ఉండడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

-మిగతా2లో

# నేపాల్‌లో వరదల బీభత్సం..



## 112 మంది మృతి..
## అప్రమత్తమైన బీహార్ ప్రభుత్వం

**నేపాల (రిపబ్లిక్ న్యూస్)** నేపాల్ లో గత కొన్నిరోజులుగా వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో ఇళ్లు నీట మునిగిపోయాయి. దీంతో అక్కడి జనజీవనం స్తంభించింది. వరద బాధితులను సహాయ దళాలు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆకస్మిక వరదల కారణంగా కొండచరియలు విరిగిపడటం వల్ల ఇప్పటి వరకు 112 మంది మరణించినట్లు సాయుధ పోలీస్ దళం (ఏపీఎఫ్), నేపాల్ పోలీసులు తెలిపారు. మరో 68మంది అదృశ్యం కాగా.. 100 మంది వరకు గాయపడ్డారు. కవ్రెపాలన్ చౌక్ జిల్లాలో 34 మంది మరణించగా.. లలిత్ పూర్ లో 20 మంది, ధాండిగ్ లో 15 మంది మరణించారు. వీటితోపాటు.. ఖాట్మండు, సింధుపాల్ చౌక్, డోలాఖా, సున్సారి తదితర జిల్లాల్లోనూ వరదల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నేపాల్ లోని వరదల ప్రభావం భారత్ లోని బీహార్ రాష్ట్రంపై పడింది. అక్కడ నుంచి కొన్ని నదులు బీహార్ లోకి ప్రవహిస్తాయి. బీహార్ లోని కోసి, గండక్, గంగా నదులు పొంగి పొర్లుతుండటంతో రాష్ట్రంలోని 13జిల్లాలకు ప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటించింది. నేపాల్ లో భారీ వర్షాల కారణంగా శనివారం రాత్రి గండక్ బ్యారేజీలో 5.40 లక్షల క్యూసెక్కుల నీటిని, కోసి బ్యారేజీకి 4.99లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో తూర్పు చంపారన్, గోపాల్ గంజ్, అరారియా, సుపాల్, కతిహార్, తదితర జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు ప్రవేశించింది.కోసీ నదిలో వద్ద పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. పలు చోట్ల వంతెన పైనుంచి నీరు ప్రవహిస్తోంది. నది ఒడ్డున నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దాదాపు 55 సంవత్సరాల తరువాత కోసి నదిలో భారీగా వరదనీరు చేరడం ఇదే తొలిసారి అని స్థానికులు చెబుతున్నారు.

## హైదరాబాద్‌లో కుండపోత వర్షం.. భారీగా ట్రాఫిక్ జాం

**హైదరాబాద్ (రిపబ్లిక్ న్యూస్)** హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. నిజాంపేట, మాదాపూర్, జూబ్లిహిల్స్, మణికొండ, నార్సింగి, గండిపేట, ఖైరతాబాద్, నాంపల్లి, హైటెక్ సిటీ, బండ్లగూడ, కూకట్‌పల్లి, మూసాపేట, బాలానగర్, కొంపల్లి, గుండ్ల పోచంపల్లి, అమీర్‌పేట తదితర ప్రాంతాల్లో కుండపోత వాన కురిసింది.

అనేక చోట్ల రోడ్లు జలమయమయ్యాయి. భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. వీకెండ్ కావడంతో సాయంత్రం సరదాగ బయటకు వచ్చినవారు వానలో తడిసిముద్దమయ్యారు. రహదారులపై వర్షపు నీటిని మళ్లించేందుకు సిబ్బంది రంగంలోకి దిగారు.

## ఏపీ ప్రభుత్వం, సీఐఐ ఉమ్మడి భాగస్వామ్యంతో కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటు.. చైర్మన్‌గా నారా లోకేశ్

రాష్ట్రంలో పెట్టుబడులు ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా ఏపీలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వచ్చే ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో 20లక్షలు ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రత్యేక దృష్టిసారించిన ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం, సీఐఐ ఉమ్మడి భాగస్వామ్యంతో కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటు చేస్తూ పరిశ్రమల శాఖ జీవో నం.58ని విడుదల చేసింది. ఫోరం చైర్మన్ మంత్రి నారా లోకేశ్ ను నియామకం అయ్యారు. వారం రోజుల్లో జీవో విడుదల చేస్తామని సీఐఐ సదస్సులో మంత్రి లోకేశ్ ఇటీవల హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

రెండేళ్ల కాలపరిమితితో ఫోరం పనిచేయనుంది. పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం, పారిశ్రామికవేత్తల మధ్య అనుసంధానకర్తగా ఫోరం వ్యవహరించనుంది. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలోని ఆర్టీజీఎస్ శాఖ సమన్వయం చేయనుంది. రాష్ట్రంలో పెట్టుబడుల అనుకూల వాతావరణం, పారిశ్రామికవేత్తలకు సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ కోసం ఇప్పటికే ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డును ప్రభుత్వం పునరుద్ధరించింది. వచ్చే ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.



## అనధికార స్థలాలకు పర్మిషన్ ఇచ్చిన అధికారులపై చర్యలు..

బీఆర్ఎస్ నేతలు మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. హైడ్రాతో పేదవారికి ఎటువంటి ఇబ్బందులూ ఉండవని చెప్పారు. హైడ్రాతో పేద, మధ్య తరగతి ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పరిశీలిస్తుందని తెలిపారు.

అనధికార స్థలాలకు పర్మిషన్ ఇచ్చిన అధికారులపై చర్యలు తప్పవని శ్రీధర్ బాబు అన్నారు. అన్ని కలెక్టర్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మల్లన్న సాగర్ రైతుల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో అందరికీ తెలుసని అన్నారు. మల్లారెడ్డి అనే రైతు చితిపెట్టుకుని ఆహుతి అయ్యారని చెప్పారు. మల్లన్న సాగర్ భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని తాము నిరసన చేస్తే తమను అరెస్ట్ చేయలేదా అని నిలదీశారు.

## వైభవంగా పల్లకీ ఉత్సవం

### పల్లకీలో స్వామి, అమ్మవార్లు ఊరేగింపు




శ్రీశైలం, సెప్టెంబరు 29 (రిపబ్లిక్ న్యూస్) : శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపములో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు.

**ఆకట్టుకున్న నిత్యకళారాధన**

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో ఆదివారం నెల్లూరుకు చెందిన వెంకటేశవర ఆర్ట్సు అకాడమీ బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆల య ధక్షిణ మాఢవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణపతిస్తుతి, ఓం నమఃశివాయ,శివతాండవ స్తోత్రం, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు మీనాక్షి, కీర్తి, వైష్ణవి, శ్రావణి, భువనేశ్వరి, భవ్య, తేజస్విని, హర్షిణి, చక్రక, పూర్వత, నాగరికత, గీతిక, మేఘన నృత్యప్రదర్శనతో అలరించారు.

## కూల్చివేతల పేరిట అధికారులు అతుత్సాహం ప్రదర్శించకండి.. జగ్గారెడ్డి వార్నింగ్



సంగారెడ్డి జిల్లా (రిపబ్లిక్ న్యూస్) : హైడ్రా అధికారులకు సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అల్టిమేటం జారీ చేశారు. హైడ్రా పేరుతో సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించకండి అని హెచ్చరించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో కూల్చివేతల పేరిట అధికారులు అతుత్సాహం ప్రదర్శించకండి అని అన్నారు.

ఇవాళ(ఆదివారం) గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా ఔటర్ రింగ్ రోడ్డు లోపలికే పరిమితమని చెప్పారు. ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు హైడ్రా విషయంలో ఎలాంటి భయాందోళనలు అక్కర్లేదని స్పష్టం చేశారు.సంగారెడ్డి ప్రజలకు తాను అండగా ఉంటానని జగ్గారెడ్డి హామీ ఇచ్చారు.

కూలగొట్టే ముందు హైడ్రా అక్కడి వాస్తవ పరిస్థితులు ప్రజలకు తెలియజేస్తే ఇంత ఇబ్బంది అయ్యేది కాదని ఎమ్మెల్యే దానం నాగేందర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. చిన్న చిన్న ఘటనలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నాయన్నారు. ఒక చిన్నారి తన పుస్తకాలు ఇంట్లో ఉన్నాయని బోరున ఏడ్చిందని... ఈ ఘటన తనకు చాలా బాధ అనిపించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇలాంటి పనులు చేసినప్పుడు ఎవరూ మాట్లాడలేదని అన్నారు.

**నిజనిర్ధారణ కమిటీ వేయాలి..**

హైడ్రా కూల్చివేతలపై నిజనిర్ధారణ కమిటీ వేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతానని, హైడ్రా కాస్త ముందే మెల్కోంటే ప్రజల్లో అభద్రతా భావం వచ్చేది కాదని ఎమ్మెల్యే దానం నాగేందర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. మూసీలో ఆక్రమణలు ఉన్నాయని మంత్రిగా కేటీఆర్ చెప్పలేదా అని ప్రశ్నించారు. అక్రమకట్టడాలను కూల్చేస్తామని కేసీఆర్ ప్రకటించిన విషయాన్ని మర్చిపోయారా అని నిలదీశారు. అక్రమ కట్టడాలకు బీఆర్ఎస్ హాయాంలో విచ్చలవిడిగా పర్మిషన్ ఇచ్చారని, కూల్చివేతలపై కాంగ్రెస్ పార్టీ కూడా మరింత లోతుగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు.

**పేదల ఇళ్లను కూల్చకూడదు..**

మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చడం సరికాదని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మురికివాడల జోలికి వెళ్లొద్దని ముందే చెప్పానని.. జలవిహార్, ఐమాక్స్ లాంటివి చాలా ఉన్నాయన్నారు. మూసీ నిర్వాసితులకు కౌన్సిలింగ్ ఇచ్చి.. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల తర్వాత ఖాళీ చేయించాల్సిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇళ్లకు రెడ్‌మార్క్ చేయడం కచ్చితంగా తొందరపాటు చర్యే అని అన్నారు. కూల్చిన ఇళ్లకు అక్కడే నివాసాలు కల్పిస్తే మంచిదని, ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళతానని దానం నాగేందర్ అన్నారు.

## మద్దిరాలపాడుకు మహర్దశ

**చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మద్దిరాలపాడు గ్రామస్థులు**

**ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతున్న వైనం**



నాగులుప్పలపాడు సెప్టెంబరు 29 (రిపబ్లిక్ న్యూస్) : మద్దిరాలపాడు గ్రామానికి మహర్దశ పట్టింది. అదంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన పుణ్యమేనని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 20న గ్రామంలో పర్యటించిన సీఎం పలు మౌలిక సదుపాయాలు, వసతుల కల్పనకు హామీ ఇచ్చారు. ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. ఆవెంటనే అందుకు సంబంధించిన కార్యాచరణ ప్రారంభమైంది. అందులోభాగంగా రూ.5.10 కోట్లతో గ్రామంలోని రోడ్లు, సైడు కాల్వలు నిర్మించనున్నారు. రూ.93 లక్షలతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, రూ.23లక్షలతో ముస్లిం కాలనీలో ఖబరస్థాన్, షాదీఖానాకు ప్రహరీ నిర్మాణం, రూ.35లక్షలతో రెండు ఎస్సీ కాలనీలకు సంబంధించిన శ్మశాన వాటికల అభివృద్ధి, రూ.45 లక్షలతో హిందూ శ్మశాన వాటిక అభి వృద్ధికి ప్రతిపాదనలు తయారు చేశారు. గ్రామంలోని పాత కరెం టు స్తంభాలను పూర్తిగా తొలగిం చి కొత్తవి ఏర్పాటు చేయనున్నా రు. ఇప్పటికే 110 విద్యుత్ స్తంభా లు గ్రామానికి వచ్చాయి.

# రైతుల నడ్డి విరుస్తున్న దుర్గా భవానీ ?

జిల్లా వ్యాప్తంగా దుర్గా భవానీ ఎరువులు,పురుగు మందుల దుకాణం దారులు ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తూ సామాన్య రైతుల నడ్డి విరిస్తున్నారు. ఎందుకంటే దుర్గ భవాని ఫర్టిలైజర్స్ వ్యాపార సామ్రాజ్యం నంద్యాల జిల్లాలో నాలుగైదు మండలాల్లో విస్తరించి ఉంది.దీంతో ఎరువుల వ్యాపారంలో నేను చెప్పిందే వేదం నా మాటే శాసనం అనే చందాన నేను అమ్మిందే రైతులు కొనాలి.. నేను చెప్పిన ధరకే కొనాలి అనే రకంగా రైతుల పరిస్థితినీ దీనంగా దిగజారుస్తున్నారు. ఫర్టిలైజర్స్ యాజమాన్యం రైతులు అడిగిన ఎరువులు ఇవ్వకుండా వారికి అమ్ముడు పోకుండా నిల్వ ఉన్న ఎరువులు అంటగడుతూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారనీ వాపోతున్నారు.ఈ క్రమంలో రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలనుకున్న ఆయనకు జిల్లా వ్యవసాయ అధికారులంటే లెక్కలేదు.దీంతో రైతులు చేసే దారి లేక , దిక్కు తోచక వారికి అవసరం లేకపోయినా దుకాణం దారులు అంటగడుతున్న ఎరువులు కొనుగోలు చేసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అసలే ఎరువుల ధరలు ఆకాశాన్ని అంటుతూ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న తరుణంలో ఇలాంటి ఎరువులు పురుగుమందుల బడా వ్యాపారి ఆగడాలతో రైతన్నలు లబోదిబో మంటు గగ్గోలు పెడుతున్నారు.కాగా ఇటీవల బండి ఆత్మకూరు మండల పరిధిలోని సంత జుటూరు ఎరువుల దుకాణంలో ఇద్దరు రైతులు పది ఇరవై ఆరు రకం కాంప్లెక్స్ ఎరువుల కేవలం ఆరు బస్తాల కోసం వెళ్లారు.అయితే అక్కడున్న దుకాణం దారుడు అమ్మోనియం పాస్ఫెట్ రెండు బస్తాలు తీసుకుంటే రెండు బస్తాలు పది ఇరవై ఆరు రకం రెండు బస్తాలు మాత్రమే ఇస్తామని చెప్పారు.మీకు పది ఇరవై ఆరు రకం కాంప్లెక్స్ ఎరువులు ఎన్ని కావాలన్న అన్ని 20,20,0,13 రకం అమ్మోనియం తీసుకోవాలని నిబంధన పెట్టారు.దీంతో సదరు రైతులు ఎరువులు కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుంది.ఇలాంటి దుస్థితి ఆ ఇద్దరు రైతులదే కాదండోయ్ మరి ఎంతో మంది రైతులు ఇలాంటి పరిస్థితినే అనుభవిస్తున్నారు.అంతే కాకుండ యూరియా కోసం వెళ్లిన రైతులకు పిలకల గుళికలు అంట గడుతున్నారు.వ్యాపార సామ్రాజ్యం విస్తరణకు నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కొందరి అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు సమాచారం.ఎందుకంటే ఆయన భార్య,ఆయన అల్లుడు డిప్యూటీ తహసీల్దార్లు పని చేస్తు ఆయన వ్యాపార సామ్రాజ్య విస్తరణకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అక్కడ చూసుకుంటారని ఆయన బాహాటంగా చెప్పే బహిరంగ రహస్యం.ఇదిలా ఉండగా ఆయనకు జిల్లా వ్యవసాయ అధికారులన్న చిన్న చూపు.ఆయన దుకాణంలో తనిఖీ కోసం వెళ్లిన వ్యవసాయ అధికారులు మొక్కుబడిగాన ఆరోపణలు లేకపోలేదు.అయితే గతంలో నంద్యాలలోని ఇదే మందుల దుకాణంలో నకిలీ ఫేక్షలాన్ దొరకడంతో గుంటూరు విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి షాప్ సీజ్ చేశారు.అయిన ఆయన ఆగడాలు ఆగడం లేదనే రైతులు ఆరోపిస్తున్నారు.అంతంత మాత్రంగా ఉన్న వ్యవసాయానికి తోడు ఇలాంటి మందుల దుకాణం దారులతో రైతులు అవస్థలు పడుతున్నారు.ఇప్పటికైనా నంద్యాల జిల్లా కలెక్టర్ స్పందించి ఆయన ఎరువులు పురుగుమందుల దుకాణంలో తనిఖీలు నిర్వహించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని నంద్యాల జిల్లా రైతాంగం కోరుతోంది.

**అమ్ముడుపోని మందులు రైతులకు అంటగడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి**

**- ఏపీ రైతు సంఘం నాయకులు రత్నమయ్య**



ఎరువులు,పురుగు మందుల దుకాణం దారులు వారికి అమ్ముడుపోని ఎరువులు, పురుగుమందులను అంటగట్టడం సరికాదని ఏపీ రైతు సంఘం నాయకులు రత్నమయ్య మండిపడ్డారు. మండలంలోని దుర్గ భవాని దుకాణం దారులు రైతులు అడిగిన ఎరువులు కాకుండా వారికి అమ్ముడుపోనీ ఎరువులు తీసుకుంటేనే మీరు అడిగిన మందులు ఇస్తామని చెప్పడం సరైందికాదని ఘాటుగా హెచ్చరించారు. ఇలాంటి వారిపై వ్యవసాయ శాఖ జిల్లా ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## పండుగలకు చేనేత వస్త్రాలనే ధరిద్దాం..నేతన్నలను ఆదరిద్దాం

రాబోయే రోజుల్లో వరుస పండుగల నేపథ్యంలో మన సంస్కృతి, సంప్రదాయాలను చాటే వస్త్రాలను ధరించడంతో పాటు చేనేతల కళారూపాలకు పెద్దపీట వేయాలని కోరారు. ‘మన కుటుంబంతో పాటు మన ఇంట్లో ఆనందంగా పండుగ చేసుకోవడంతో పాటు చేనేత వస్త్రాలపై ఆధారపడి బతికే అందరి ఇళ్లల్లో పండుగ సంతోషం నింపాలి’ అని హోంమంత్రి వంగలపూడి అనిత కోరారు.

**జగన్ పాలన వల్ల ఏపీకి ఎక్కువ నష్టం: మంత్రి రామానాయుడు**

మరోవైపు... రాష్ట్ర విభజన కంటే జగన్ పాలన వల్ల ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. 2014-19 ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. ఇవాళ(ఆదివారం) పశ్చిమగోదావరి జిల్లాలో టిడ్కో ఇళ్లను మంత్రులు నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ...పేదల కల నెరవేరాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.

**వైసీపీ ప్రభుత్వంలో రంగులు వేశారు..**

టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లను పూర్తి చేయకుండా.. వైసీపీ ప్రభుత్వంలో ఆ ఇళ్లకు రంగులు వేశారని విమర్శించారు. ఐదేళ్ల పాటు జగన్ పాలనలో ప్రజా సమస్యలపై ఎన్నో ఉద్యమాలు చేశామని అన్నారు. టిడ్కో ఇళ్లకు పూర్వ వైభవం తీసుకురావడం కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. ఇళ్ల లబ్ధిదారులను బలవంతంగా రుణగ్రస్తులను చేశారని చెప్పారు. పది శాతం పెండింగ్ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అతి త్వరలో ఇళ్లను అందజేస్తామని తెలిపారు. ఒక్క పాలకొల్లులోనే రూ.150 కోట్లు ఇళ్లను తాకట్టుపెట్టి ఆ నిధులను మాజీ సీఎం జగన్ పక్క దారి పట్టించారని విమర్శించారు. ప్రపంచ స్థాయిలో మళ్లీ అమరావతిని తిరిగి నిలబెట్టేందుకు మంత్రి నారాయణ కృషి చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

## నగరంలో అంధకారం

హుద్‌హుద్ తుఫాన్ (2014) తర్వాత అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జీవీఎంసీ అధికారులు నగరంలో 1.18 లక్షల ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటుచేశారు. వీటి ఏర్పాటుతోపాటు నిర్వహణకు ఢిల్లీకి చెందిన ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఏడేళ్లపాటు వీధి దీపాల నిర్వహణ బాధ్యత చూసేందుకుగాను రూ.85 కోట్లు చెల్లించేందుకు జీవీఎంసీ అంగీకరించింది. ఒప్పందం ప్రకారం ఎక్కడైనా వీధి దీపం పాడైపోతే 48 గంటల్లోగా ఏజెన్సీ అమర్చాల్సి ఉంటుంది.

లేనిపక్షంలో జీవీఎంసీకి జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటుచేసిన తర్వాత కొంతకాలం పాటు నిర్వహణ బాగానే ఉండేది. కానీ సముద్రపు గాలులు, వాతావరణంలో మార్పుల కారణంగా ఎల్ఈడీ లైట్లు మరమ్మతులకు గురవుతుండేవి. వాటిని సకాలంలో మార్చడం, మరమ్మతు చేయడంలో ఏజెన్సీ విఫలమవ్వడంతో సమస్య మొదలైంది. 2022తో ఏజెన్సీ ఒప్పంద గడువు పూర్తయ్యింది. అయినప్పటికీ కొంతకాలం అదే ఏజెన్సీకి అప్పగించారు. ఆ తరువాత జీవీఎంసీ స్వయంగా వీధి దీపాల నిర్వహణ బాధ్యతలు నిర్వహించింది. కొన్నాళ్ల కిందట జీవీఎంసీ ఎన్‌బీఎం ఏజెన్సీతో ఒప్పందం చేసుకుంది. అయితే కాంట్రాక్టర్ అవసరమైనంత సిబ్బందిని నియమించకపోవడంతో నగరంలో వీధి దీపాల సమస్య తీవ్రమైంది. వీధి దీపాలు ఎక్కడైనా పాడైపోతే ఫిర్యాదు అందిన తర్వాత నెలలు దాటినాసరే మరమ్మతులు చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులు ఎన్నిసార్లు నోటీసులు జారీచేసినా పట్టించుకోవడం లేదు.


నగరంలో 1.18 లక్షల ఎల్ఈడీ వీధి దీపాలు ఉండగా వాటిలో ప్రస్తుతం సుమారు 58 వేల వరకూ వెలగడం లేదని అంచనా. దీనివల్ల చీకటిపడితే చాలు అనేక ప్రాంతాల్లో చీకటి రాజ్యమేలుతోంది. కొమ్మాది నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకూ జాతీయ రహదారిపై అనేక స్ట్రెచ్‌లల్లో దీపాలు వెలగడం లేదు. నగర శివారు ప్రాంతాలైన మధురవాడ, పీఎం పాలెం, అగనంపూడి, భీమిలి, వడ్లపూడి, కూర్మన్నపాలెం ప్రాంతాల్లో అయితే రాత్రిపూట అంధకారం సర్వసాధారణంగా మారిపోయింది. నగర నడిబొడ్డున అక్కయ్యపాలెం, రామచంద్రనగర్, అబిద్ నగర్, 80 ఫీట్ రోడ్డు, శ్రీనివాసనగర్, బాలయ్యశాస్త్రిలేఅవుట్, సీతమ్మధార, కంచరపాలెం, కప్పరాడ వంటి ప్రాంతాల్లో కూడా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో చైన్‌స్నాచింగ్‌లు, ఇళ్లలో దొంగతనాలు జరుగుతున్నాయి. అలాగే పాదచారులు రాత్రివేళ రోడ్డు దాటుతున్నపుడు వాహనచోదకులు గుర్తించలేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌తోపాటు జిల్లా కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి రాత్రివేళ వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా నగరంలో కొన్నిచోట్ల వీధీదీపాలు వెలుగుతున్నాసరే వాటి నుంచి అంతంతమాత్రంగా కాంతి వస్తుండడంతో వాటి ఇల్యుమినేషన్ సామర్థ్యాన్ని పెంచాలని సీపీ కోరారు.

ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో కూడా కార్పొరేటర్లతోపాటు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సైతం వీధి దీపాల సమస్యపై విరుచుకుపడ్డారు. రాత్రిపూట నగరంలో అరాచకం రాజ్యమేలుతోందని విష్ణుకుమార్‌రాజు ఆగ్రహం వ్యక్తంచేసారు. గంజాయి బ్యాచ్‌లు చెలరేగిపోతున్నాయని, నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. జీవీఎంసీ ఏడాదికి సుమారు రూ.12 కోట్లు ఖర్చు చేస్తున్నా కాంట్రాక్టర్ పనులు ఎందుకు చేయడం లేదంటూ ఇంజనీరింగ్ అధికారులను నిలదీశారు. దీనికి కమిషనర్ సంపత్‌కుమార్ సమాధానం ఇస్తూ తాను కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐదుసార్లు నగరంలో రాత్రిపూట పర్యటన చేసి, వీధి లైట్ల సమస్యపై సమీక్ష చేశానన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కనిపించడంతో అతన్ని ఎందుకు తొలగించకూడదంటూ షోకాజ్ నోటీసు ఇచ్చామన్నారు. కొద్దిరోజుల్లో వైఖరి మారకపోతే మరొక నోటీసు జారీచేసి తర్వాత న్యాయపరమైన వివాదాలకు అవకాశం లేకుండా కాంట్రాక్టర్‌ను తొలగిస్తామన్నారు. రెండు నెలల్లో వీధి దీపాల సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ ఇసుకను కాజేసిన వైసీపీ ప్రజాప్రతినిధి

**ప్రస్తుతం మార్కెట్‌లో ఇసుకకు బాగా డిమాండ్ ఉంది. టన్ను రూ.2 వేల వరకు అమ్ముతున్నారు.**



మార్కాపురం, సెప్టెంబరు 29 (రిపబ్లిక్ న్యూస్) : ప్రస్తుతం మార్కెట్‌లో ఇసుకకు బాగా డిమాండ్ ఉంది. టన్ను రూ.2 వేల వరకు అమ్ముతున్నారు. ఈ సమమంలో పెద్దారవీడుకు చెందిన ఓ వైసీపీ ప్రజాప్రతినిధి నూతన గృహం నిర్మిస్తున్నాడు. డబ్బులు పెట్టి ఇసుక కొనడంకంటే ప్రభుత్వానిదైతే ఊరకే వస్తుందని కదా అని ఆలోచించాడు. పెద్దారవీడు ఎంపీడీవో కార్యాలయ సమీపంలో గృహనిర్మాణశాఖకు చెందిన ఇసుకపై కన్నేశాడు. అనుకున్నదే తడవుగా రాత్రికిరాత్రే 20 ట్రాక్టర్లతో ఆ కార్యాలయం వద్ద ప్రభుత్వం తోలిన ఇసుకను తరలించేశాడు. విషయం తెలుసుకున్న ఆ శాఖ అధికారి గ్రామస్థులను విచారించారు. అయితే ఎవరూ కూడా తమకు తెలియదని తప్పించుకున్నారు. కొంతమేర సమాచారంతో పోలీసులకు ఇసుక దొంగతనంపై ఫిర్యాదు చేశారు. నియోజకవర్గస్థాయి నాయకుని ఒత్తిడితో ప్రస్తుతానికైతే పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే పోలీసుశాఖ వైసీపీ నాయకులపై చర్యలు ఏ మాత్రం తీసుకుంటారోనని మండల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మారినా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో వైసీపీ నాయకుల దురాగతాలు ఆగడంలేదనడానికి ఇదొక ఉదాహరణ మాత్రమే. నియోజకవర్గంలోని పెద్దారవీడు మండల కేంద్రంలో జరిగిన ఈ దొంగతనం విషయంలో పోలీసులు ఏ మాత్రం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తారో వేచిచూడాలి.

**- రెండుసార్లు ఇసుక చోరీ**

పెద్దారవీడు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో గృహనిర్మాణశాఖ మండలంలోని గృహ నిర్మాణాల లబ్ధిదారుల కోసం ఇసుక డంప్‌ను ఏర్పాటు చేశారు. లబ్ధిదారులు ఇక్కడ నుంచే నిర్మాణాలకు ఇసుకను తరలిస్తుంటారు. ఆ సమీపంలోనే తహసీల్దార్, వ్యవసాయాధికారి కార్యాలయాలు కూడా ఉన్నాయి. మూడు మాసాల క్రితం డంప్ నుంచి సుమారు 10 ట్రాక్టర్ల ఇసుక మాయమైంది. అప్పట్లో గృహనిర్మాణశాఖ అధికారులు అనుమానంతో పలుచోట్ల విచారించారు. ఇసుకను ఎవరు దొంగిలించారో గుర్తించలేకపోయారు. ఈ నెల 24న సుమారు 20 ట్రాక్టర్ల మేర ఇసుకను దొంగతనంగా తరలించినట్లు ఆ శాఖ సిబ్బంది గుర్తించారు. వెంటనే ఉన్నతాధికారులకు విషయం తెలిపారు. వారి సూచన మేరకు పెద్దారవీడు గ్రామంలో విచారించారు. ఒక ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌తో ఇసుకను దొంగతనం చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. ఈ నెల 25న గృహనిర్మాణశాఖ ఏఈ శ్రావ్య పెద్దారవీడు పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అక్కడ పోలీసు అధికారి, సిబ్బంది తాము విచారించిన తర్వాత కేసు గురించి ఆలోచిద్దామని నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ విషయాన్ని గృహనిర్మాణశాఖ అధికారులు నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకునికి తెలియజేశారు. ఆయన పోలీసులతో మాట్లాడటంతో వెంటనే కేసు నమోదు చేశారు. ఇసుకను తరలించేందుకు ఉపయోగించిన వాహనాల వివరాలు కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు.

**- దొంగలు దొరికేనా..?**

పెద్దారవీడు మండల కేంద్రంలో వైసీపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి కుటుంబం హవా అంతా ఇంతా కాదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి అనుయాయులుగా చెప్పుకుంటూ చేయని అక్రమాలు లేవు. ప్రభుత్వ భూములను కబ్జా చేయడం, రికార్డులు తారుమారు చేయడం వారికి కొట్టిన పిండి. గ్రామస్థులు ఎవరైనా ఇందేంటని ప్రశ్నిస్తే వారిని వేధించడం అక్కడ పరిపాటి. ఈ క్రమంలోనే పలుమార్లు ప్రభుత్వ శాఖలకు చెందిన మెటీరియల్‌ను ఇదే విధంగా అపహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం గ్రామంలో నూతన గృహం నిర్మిస్తున్న వైసీపీ ప్రజాప్రతినిధి తనను ఎవరేం చేస్తారులే అనే ధైర్యంతోనే ప్రభుత్వానికి చెందిన ఇసుకను రెండుమార్లు దొంగిలించినట్లు తెలుస్తోంది. అధికారులు మారినా పోలీసు స్టేషన్‌లో ఉండే కిందిస్థాయి సిబ్బందితో ఆ ప్రజాప్రతినిధి కుమారుడు సత్సంబంధాలను కలిగివున్నాడు. ఆధారాలతో సహా హౌసింగ్ అధికారులు ఫిర్యాదు చేసినా పోలీసులు దొంగలను పట్టుకుంటారో, తప్పిస్తారోనని పెద్దారవీడు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

## నేడు పిజిఆర్ఎస్ ద్వారా ప్రజా వినతుల స్వీకరణ.

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



నంద్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 29, రిపబ్లిక్ న్యూస్ నేడు సోమవారం నంద్యాల పట్టణం కలెక్టరేట్ లోని సెంటినరీ హాలులో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను "పబ్లిక్ గ్రివియన్స్ రెడ్రెస్సల్ సిస్టం (పి జి ఆర్ ఎస్)" ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే "పబ్లిక్ గ్రివియన్స్ రెడ్రెస్సల్ సిస్టం" కార్యక్రమానికి నేడు సోమవారం ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.





## ప్రజాశాంతికి భంగం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

### సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని కౌన్సెలింగ్

నంద్యాల, సెప్టెంబర్ 29, (రిపబ్లిక్ న్యూస్): శాంతిభద్రతల పరిరక్షణ, నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషను పరిధిలో నివసిస్తున్న హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులను సంబంధిత పోలీసు అధికారులు స్టేషనుకు పిలిచి, సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

వారు ప్రస్తుతం జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. నిరంతరం మీ కదలికలపై నిఘా ఉంచడం జరుగుతుందని,నేర ప్రవృత్తిని విధానాడకుంటే కఠిన చర్యలు తప్పవని హిస్టరీ షీట్లు కలిగిన వారిని సంబంధిత పోలీసు అధికారులు హెచ్చరించారు.

## హిందూ స్మశాన వాటికలను అభివృద్ధి చేద్దాం

### మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి



నంద్యాల ప్రతినిధి సెప్టెంబర్ 29 ( రిపబ్లిక్ న్యూస్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ఎంపీ బైరెడ్డి శబరి సహకారంతో నంద్యాల జిల్లాలోని అన్ని గ్రామాల్లో హిందూ స్మశాన వాటికలను మొదటి విడతలో అభివృద్ధి చేసుకుందామని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు

ఆదివారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో ఆళ్లగడ్డ జనసేన అధికార ప్రతినిధి ఇరిగెల సూర్యనారాయణరెడ్డి తదితరులతో బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సమావేశం అయ్యారు.

ఈ సందర్భంగా మొదటి విడత హిందూ స్మశాన వాటికలు, రెండవ విడతలో ముస్లిం, క్రిస్టియన్ తదితరుల స్మశాన వాటికలని బాగుచేసుకుందామని, అవసరమైన గ్రామాల్లో ప్రతిపాదనలు తయారు చేసి ఎంపీ బైరెడ్డి శబరి ద్వారా అధికారులకు అందించాలని ఆయన కోరారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని, ఉమ్మడి ప్రభుత్వంలో పేదలకు న్యాయం చేద్దాం అన్నారు. సిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ తదితర మండలాల్లో పలు సమస్యల పరిస్కారం కోసం బైరెడ్డి రాజశేఖర్ రెడ్డితో ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి సమాలోచనలు చేశారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు న్యాయవాది రెడ్డి గారి అమిర్ బాషా, రుద్రవరం జనసేన మండల కన్వీనర్ లింగామయ్యగౌడు, నాయకులు పి. చాంద్ బాషా, పెద్ద బాలయ్య, ఇబ్రహీంఖాన్, కొప్పర్ల బాషా, నాగరాజు శెట్టి, తేజనాథ్ తదితరులు ఉన్నారు.

## నంద్యాల పట్టణంలో వైసిపి ప్రభుత్వం చేసిన తప్పులే, తెలుగుదేశం పార్టీ చేస్తుంది, -సిపిఎం

నంద్యాల సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్): పట్టణంలోని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సిపిఎం పార్టీ ఆఫీసు నందు ఆదివారంసమావేశం నిర్వహించారు .మున్సిపాలిటీ స్థలాలు గత వైసీపీ ప్రభుత్వంలో కబ్జాలు బాగా జరిగినాయి, నంద్యాల పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపిస్తాం మాకు ఒక అవకాశం ఇవ్వండి అంటూ అధికారంలోకి వచ్చారు,గత వైసిపి ప్రభుత్వం చేసిన తప్పే నేడు తెలుగుదేశం పార్టీ చేస్తుంది అంటూ సిపిఎం పార్టీ పట్టణ కమిటీ పత్రికా ప్రకటనకు తెలియజేసింది, ఈ సమావేశంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు తోట మద్దులు,పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే ఎం డి గౌస్, డి లక్ష్మణు,లు పాల్గొన్నారు ఈ సమావేశాన్ని ఉద్దేశించి నంద్యాల పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు మాట్లాడుతూ మున్సిపాలిటీ స్థలాలు అంటే ప్రజల యొక్క ఆస్తులు నంద్యాల మున్సిపాలిటీకి ఆదాయం తెచ్చే స్థలాలు అటువంటి స్థలాలను నేడు అధికారాన్ని అడ్డుపెట్టుకొని కబ్జాలు చేయడం పద్ధతి కాదని వారన్నారు, గతంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇదే భూకబ్జాలు చేసి అధికారం కోల్పోయింది, ఇప్పుడు కూడా తెలుగుదేశం పార్టీ అదే తప్పులు చేస్తే ఇదే చివరి అవకాశం అవుతుందని వారు అన్నారు, కాబట్టి తక్షణమే మున్సిపాలిటీ స్థలాలను కబ్జా చేసిన వారి చేతిలో నుంచి తీసుకొని మున్సిపాలిటీ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని వారు కోరారు,అవి కోట్ల విలువైన స్థలాలు కాబట్టే నంద్యాల జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీకి చెందిన స్థలాలపై అధికార టీడీపీ నాయకులు కన్నేశారు, వాటిని కబ్జాచేసేందుకు రంగం సిద్ధం చేశారు. తాజాగా నంద్యాల మున్సిపాలిటీ పరిదిలోని రైతునగర్ సచివాలయం ఆవరణంలోని వర్మీకంపోస్టు సంబంధించిన స్థలాన్ని కొందరు కబ్జాదారులు ఆక్రమించేందుకు పన్నాగం పన్నారు. ఇది మున్సిపాలిటీకి చెందిన స్థలం అని బహిరంగంగా అందరికి తెలిసినా సంబంధిత అధికారులు ఈ స్థలం విషయంలో అధికారులు చూసి చూడనట్లు ఉండడం బాగాలేదు, నంద్యాల వాసులకు సుపరిచతమైన నాగులకుంట రోడ్డులోని పాలకొమ్మచెట్టు ఉన్న ప్రాంత మున్సిపాలిటీ స్థలం నేడు టీడీపీ నాయకులు కబ్జాచేసి ఏకంగా ఆ ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్సు నిర్మించడం జరిగింది. ఈ స్థలం మున్సిపాలిటీకి చెందినది అని నంద్యాల పట్టణంలో ప్రజలందరికీ తెలుసు కాబట్టి తక్షణమే ఈ యొక్క స్థలాన్ని మున్సిపాలిటీ తీసుకోవాలి,ఈ వివాదాస్పదమైన స్థలాన్ని మున్సిపాలిటీ అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలి, అలాగే రామకృష్ణా విద్యాలయం సంజీవనగర్ రైతుబజార్ పక్కన ఉన్న స్థలం కూడా దానిని కూడా ప్రభుత్వం




తీసుకోవాలనివారు కోరారు, మున్సిపాలిటీ స్థలాలన్నీ ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకొని రావాలని వారు కోరారు, అలాగే ఈ స్థలాలు కబ్జా చేయడం వెనుక న్యాయశాఖ మంత్రి, మైనార్టీ శాఖ మంత్రి హస్తం ఉందని ప్రజలందరూ అనుకుంటున్నారు కాబట్టి తక్షణమే ఎన్ఎండి ఫరూక్ ఈ స్థలాలన్నిటిని మున్సిపాలిటీకి అప్పజెప్పే పని చేయాలని వారు అన్నారు,లేకపోతే గతంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్టీకి పట్టిన గతే మీకు పడుతుందని వారు హెచ్చరించారు

## మతోన్మాద, ఫాసిస్టు శక్తుల నుండి దేశాన్ని కాపాడుకుందాం.



వెలుగోడు సెప్టెంబర్ 29 రిపబ్లిక్ న్యూస్ మతోన్మాద ఫాసిస్ట్ శక్తుల నుండి.బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు దాడులకు, హత్యలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి వై నరసింహులు పిలుపునిచ్చారు.జ్యోతిరావు పూలే సత్యశోధన స 152 వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కుల నిర్మూలన, ఆచరణాత్మక వారోత్సవం లో భాగంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమం అఖిలభారత రైతు కూలి సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ బి ఆనంద్ అధ్యక్షతన నిర్వహించారు . ఈ సందర్భంగా వై నరసింహులు మాట్లాడుతూ భారతదేశంలో నిచ్చెనమెట్ల లాగా ఉన్న కుల వ్యవస్థ , సతి సహగమనం వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు, స్త్రీలకు విద్యను అందించాలనే లక్ష్యంతో సావిత్రిబాయి పూలే. స్త్రీలకు విద్య నేర్పించి చైతన్య పరచడం కోసం సత్యశోధ అనే సంస్థను ఏర్పాటు చేశారన్నారు .నేడు భారతదేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కులం పేరుతో ,మతం పేరుతో ఎస్సీ .ఎస్టీ .మైనార్టీ. బీసీల కులాలపై దాడులు హత్యలు . వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు .ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎం గోపాల్. అఖిలభారత రైతుకు కూలి సంఘం మండల నాయకులు లాలూ నాయక్. తెలుగు అంకన్న, సూర్యనారాయణ రెడ్డి, కృష్ణ, బి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.








## గ్రామీణ ప్రాంత పేదల కోసమే పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ..

నంద్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 29, రిపబ్లిక్ న్యూస్ :: గ్రామీణ ప్రాంత పేదల కోసమే పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కార్పొరేట్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని నంద్యాల శ్రీ గురురాఘవేంద్ర బ్యాంకు కోచింగ్, డైరెక్టర్ మౌలాలి రెడ్డి అన్నారు. సంజామల మండలం మంగంపల్లె గ్రామంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో ఉచిత మెగావైద్య శిభిరం పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటి ఆధ్వర్యంలో నిర్వహించారు. చారిటబుల్ సొసైటి ఆధ్వర్యంలో నిర్వహించిన 48వ ఉచిత వైద్య శిబిరంలో విజయవంతంగా ముగిసింది. శిబిరంలో పాల్గొన్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పి మౌలాలి రెడ్డి మాట్లాడుతూ నంద్యాల, కర్నూలు పట్టణానికి చెందిన అనుభవజ్ఞులైన డాక్టర్లతో వైద్య శిబిరంలో రోగులను ఉచితంగా వైద్య పరీక్షలు చేయిస్తున్నామని అన్నారు. వైద్య శిబిరానికి హాజరైన ప్రజలందరికీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత భోజనం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ శిబిరంలో 1400 మంది రోగులు పాల్గొనగా ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు వివరించారు. ప్రతి నెలా చివరి ఆదివారం పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలు ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవడం సంతోషాన్ని కలిగిస్తుందని అన్నారు. శ్రీ గురు రాజా స్కూల్ డైరెక్టర్ షేకావలిరెడ్డి మాట్లాడుతూ మా అబ్బ జ్ఞాపకార్థం పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ పేరున మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో 48వ వైద్య శిబిరాన్ని మంగంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. వైద్య శిబిరంలో పాల్గొనే వారందరికీ ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఖరీదైన మందులను అందజేస్తున్నామని తెలిపారు. డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి తన సొంతం ఊరికి మేలు చేయాలన్న లక్ష్యంతో నంద్యాలలో స్థిరపడినా ఈ గ్రామ ప్రజలకు సేవ చేస్తున్నానని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలోని ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో గుండె జబ్బులు, బిపి, షుగరు , మోకాళ్ళ నొప్పులు, కంటివ్యాదులు, ఊపిరితిత్తుల వ్యాధులు, స్త్రీలకు సంబందించిన వ్యాదులు, చెవి , ముక్కు , గొంతుకు సంబందించిన జబ్బులకు , దంతవ్యాదులు, చర్మవ్యాదులకు వైద్యసేవలు చేసి మందులను ఇస్తున్నామని తెలియజేశారు. కోవెలకుంట్ల సంజామల మండలం పరిసర ప్రాంతం ప్రజలందరూ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారు.




## జీవో 117 రద్దు చేయాలన ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం.



నంద్యాల ప్రతినిధి ,29 సెప్టెంబర్, రిపబ్లిక్ న్యూస్ :: గత ప్రభుత్వ విధానాలతో అస్తవ్యస్తంగా మారిన విద్యావ్యవస్థను గాడిన పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలలో భాగంగా వచ్చే విద్యా సంవత్సరం ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ జీఓ 117ను రద్దు చేసి, మూడు నాలుగు ఐదు తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లో కలపాలని నిర్ణయం తీసుకోవడం పట్ల షెడ్యూల్డు ట్రైబ్స్ టీచర్స్ ఫెడరేషన్(ఎస్టీటీఎఫ్) జిల్లా అధ్యక్షులు సి.నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఎస్టీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం జీవో నం.117 ను తీసుకొచ్చి 3,4,5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలలలో విలీనం చేసిందని ఫలితంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు మూతబడ్డాయని, 15వేల ఎస్జీటీ పోస్టులు రద్దయి తొమ్మిది వేల పైబడి ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ బడులుగా మారిపోయాయన్నారు.ఎన్నికల ముందు ఎన్డీయే ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఉత్త ర్వులను రద్దు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించిందని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ రద్దు అమల్లోకి వచ్చేలా కసరత్తు చేస్తోందని అన్నారు.జిల్లా ఉపాధ్యక్షులు పి. రాము మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీలలతోపాటు పదోన్నతులకు ప్రత్యేకంగా చట్టం చేయాలని ప్రభుత్వం భావిస్తోందని ఇందుకోసం గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల చట్టాలను అధ్యయనం చేస్తుందని అన్నారు. త్వరలోనే 2003 లో నియామకం పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, చంద్రమోహన్, రవీంద్ర బాబు,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గోమాత గోష విను గోవింద.




డోన్, సెప్టెంబర్ 29, రిపబ్లిక్ న్యూస్ : బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమం లో భాగంగా, డోన్ లో నిరసన కార్యక్రమం చేపట్టిన కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో డోన్ లో అయ్యప్ప స్వామి దేవాలయం లో ఉన్న గోవును పూజిస్తూ నిరసన తెలిపారు. హిందువులంతా కలియుగ ప్రత్యక్షదైవంగా ఆరాధించే శ్రీ వేంకటేశ్వర స్వామికి కలుషిత నైవేద్యం సమర్పించారని గత 15 రోజులుగా టీటీడీ అధికారులు, ప్రభుత్వ అధినేతలు ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా చేస్తున్న పత్రిక ప్రకటనల చూసి యావత్ హిందూ సమాజం తీవ్ర మనోవేదనకు గురై తే మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం గోవు కూడా కలుషిత ఆహారం తిని కలుషిత పాలు ఇస్తుందని సభ్య సమాజం తలదించుకునేలా మాట్లాడడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ప్రపంచంలోనే ఆక్సిజన్ తీసుకొని ఆక్సిజన్ వదిలే జంతువు ఒక గోమాత మాత్రమేనని అలాంటి గోమాతను అవమానించడం సిగ్గుచేటని తెలిపారు. హిందూ సాంప్రదాయం ప్రకారం వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో గతంలో పాలించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించే సమయంలో తన సహ ధర్మ చారినితో కలిసి మీ ఐదేళ్ల పాలన ఎప్పుడైనా వెళ్ళావా ఒకరే వెళ్లి పట్టువస్త్రాలు లు సమర్పించడం హిందూ సంప్రదా యాన్ని అవమానించటమేనని తిరుమల ప్రధానార్చకులు రమణ దీక్షితులు ప్రశ్నిస్తే అతనిని తిరుమల నుండి బయటికి పంపే శారని, వెంకటేశ్వర స్వామి మహా ప్రసాదంగా భావించే తిరుమల లడ్డు తయారిలో జంతువుల కొవ్వుల అవశేషాలు కల్తీ చేయడం ద్వారా హిందువులను అవమానించారు అని, అంతేకాకుండా గత బోర్డ్ చైర్మన్ నాణ్యమైన లడ్డూలను భక్తులకు ఇస్తామని చెప్పి 25 రూపాయలు ఉన్న లడ్డును 50 రూపాయలు చేసి కల్తీ లడ్డూలను భక్తులకు వితరణ చేసి ఆ పాపాన్ని మూటగట్టుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో డోన్ నియోజకవర్గం కన్వీనర్ సందు వెంకట రమణ, బీజేపీ నాయకులు అశోక్, నాగార్జున, రామయ్య, హరినాయుడు, శివయ్య, ఆరబోలు వీరేష్, పవన్, జనసేన నాయకులు నాగేంద్ర బాబు, తరుణ్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈ పంట నమోదు సూపర్ చెక్

### ఏ.వో పవన్ కుమార్.

వెలుగోడు సెప్టెంబర్ 29 రిపబ్లిక్ న్యూస్

ఈ ఖరీఫ్ 2024 వెలుగోడు మండలంలో రైతుల సాగు చేసిన పంటలను ఈ పంట నమోదు పూర్తి చేసిన770 రికార్డులు, సూపర్ చెక్ కొరకు వ్యవసాయ అధికారి పవన్ కుమార్ కి రాగా వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి ధ్రువీకరించడమైనది. వారు మాట్లాడుతూ ఈ పంట నమోదు పక్కగా జరిగిందని, రైతులు ఏ సర్వే నెంబర్లో ఏ పంటలు సాగు చేశారు, ఏ రకము, సాగు పద్ధతి అలాగే నీటి ఇరిగేషన్ పద్ధతి మొదలగు వాటిపై సూపర్ చెక్ నిర్వహించడం జరిగినది.ఈ సూపర్ చెక్కు నందు రైతులు ఏవైనా ఈ పంట నందు మార్పులు అవకాశం ఉన్నదని తెలిపారు . ఈ కార్యక్రమంలో మాధవరం విస్తరణ సిబ్బంది నాగలింగం పలువురు పాల్గొన్నారు.

## రైలులో 3.5 కిలోల బంగారు చోరీ

**నంద్యాల క్రైమ్ సెప్టెంబర్ 29 ( రిపబ్లిక్ న్యూస్):** కర్ణాటకలోని హుబ్బళ్లి నుంచి విజయవాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో శనివారం ఉదయం రూ.2.5 కోట్ల విలువైన 3.5 కిలోల బంగారు ఆభరణాలను దొంగలు అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన కాశీ విశ్వనాథ్, రంగారావు సత్తెనపల్లిలో 'సాయిచరణ్ జ్యువెలర్స్' పేరుతో బంగారు ఆభరణాల వ్యాపారం చేస్తున్నారు. వీరు ఆభరణాలను తయారుచేసి కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో విక్రయిస్తుంటారు. అందులోభాగంగా రంగారావు, ఆయన సోదరుడు సతీశ్ బాబుతో కలిసి బంగారు ఆభరణాలను తీసుకొని మంగళవారం రాత్రి సత్తెనపల్లి నుంచి బళ్లారి వెళ్లారు. మూడు రోజులపాటు బళ్లారిలో ఉండి పలు దుకాణాల వ్యాపారులను సంప్రదించినా.. వారు ఆభరణాల కొనుగోలుకు ముందుకు రాలేదు. దీంతో శుక్రవారం రాత్రి హుబ్బళ్లి-విజయవాడ రైలులో తిరుగు ప్రయాణమయ్యారు.

నంద్యాల వరకు మెలకువగా ఉన్నా, తర్వాత ఆభరణాలున్న బ్యాగును రంగారావు తన తల కింద పెట్టుకొని నిద్రపోయారు. రైలు దొనకొండ సమీపానికి వచ్చేముందు మెలకువ వచ్చి చూసుకోగా బ్యాగు కనిపించలేదు. దీంతో వెంటనే రైలుదిగి దొనకొండ రైల్వే స్టేషన్ కు శనివారం ఉదయం ఏడు గంటల సమయంలో వెళ్లారు. అక్కడ రైల్వే పోలీసుస్టేషన్ లేకపోవడంతో.. కొందరు మార్కాపురం వెళ్లాలని సూచించగా అక్కడికి వెళ్లారు. అక్కడివారు నరసరావుపేట వెళ్లాలని చెప్పడంతో మధ్యాహ్నం 12 గంటలకు అక్కడికి వెళ్లారు. అక్కడి రైల్వే పోలీసులు సాయంత్రం వరకు రకరకాల ప్రశ్నలు అడిగి, చివరికి దొంగతనం జరిగిన ప్రాంతం నంద్యాల రైల్వే పోలీసుల పరిధిలోకి వస్తుందని, అక్కడికి వెళ్లాలని సూచించారు. దీంతో వారు రాత్రి నరసరావుపేట నుంచి బయలుదేరి నంద్యాల రైల్వే పోలీసుల వద్దకు వెళ్లారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.చోరీ జరిగిందని తెలిసినా.. దొంగలను పట్టుకునేందుకు వెంటనే స్పందించకపోగా.. కనీసం కేసు నమోదుచేయకుండా రైల్వే పోలీసులు పరిధి పేరుతో నిర్లక్ష్యం ప్రదర్శించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలం



**తాండూర్, సెప్టెంబరు 29 (రిపబ్లిక్ న్యూస్) :** స్థానిక సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయ న మాట్లాడుతూ గ్రామాల ప్రజలు అనారోగ్యం, జ్వరాలతో బాధపడు తున్నా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారన్నారు. ఐబీ సెంటర్‌లోని కూరగాయల సంత వద్ద మరుగుదొడ్లు ఏర్పాటు చేయా లని డిమాండ్ చేశారు. అనంతరం సభ్యత్వ నమోదుపై నాయకులు, కార్యకర్తలకు సూచనలు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, సభ్యత్వ నమోదు కోకన్వీనర్ చిలుముల శ్రీకృష్ణదేవరా యలు, నాయకులు సుధీర్‌గౌడ్,చిరంజీవి, శేషగిరి, మహీధర్‌గౌడ్, ప్రదీప్, విగ్నేష్, శ్రీనివాస్, చరణ్, చంద్రయ్య,చందు,మహేష్, సతీష్, శ్రావణ్, శంకర్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ దండె విఠల్ పరామర్శ



**బెజ్జూరు, సెప్టెంబరు 29 (రిపబ్లిక్ న్యూస్) :** మండలంలోని బారెగూడ గ్రామానికి చెందిన రామగిరి జింగమ్మ ఇటీవల మృతి చెందగా ఆదివారం ఎమ్మెల్సీ దండెవిఠల్ ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన రాదండి సత్తయ్య కిడ్నీసంబంధితవ్యాధితో బాధపడుతుండ డంతో ఆయనను పరామర్శించి మెరుగైనవైద్యం కోసం హైదరాబాద్‌కు రావాలని అందుకు ఏర్పాటుచేస్తానని అన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన కొండ్ర బుచ్చమ్మ సంవత్సరిక కార్యక్రమానికి హాజర య్యారు. అలాగే శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రహరీనిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూ రు చేయిస్తానని అన్నారు. ఆయనవెంట జడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, నాయకులు హర్షద్, శ్రీవర్ధన్, ఓంప్రకాష్,పుష్పలత, నహీర్‌అలీ, రాజేష్, పెంటన్న, కృష్ణ, సంతోష్, అనీల్, పెంటన్న, నహీర్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కరించడానికే గ్రామాల్లో పర్యటన

**జైపూర్, సెప్టెంబరు 29 (రిపబ్లిక్ న్యూస్) :** సమస్యలను పరి ష్కరించడానికే గ్రామాల్లో పర్యటిస్తున్నానని ఎమ్మె ల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం ఇందారంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ కోతలు ఎక్కువగా ఉం టున్నాయని సమస్యను పరిష్కరించాలని ఎమ్మె ల్యేకు తెలిపారు. ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికా రులతో మాట్లాడి కోతలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఎల్లమ్మ గుడి నిర్మాణానికి కృషి చేస్తానని, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు చేశానని తెలిపారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ఇందారంలో మంచినీటి ఎద్దడి నివారణకు విశాఖ ట్రస్టు ద్వారా 20 బోర్‌వెల్‌లు వేశానని తెలిపారు. గ్రామాభివృద్ధికి త్వరలో మరిన్ని నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఎస్సీ కాలనీ ప్రజలకు తాగునీటి ఎద్దడి నివారణకు ఒక బోర్‌వెల్ మంజూరు చేశానన్నారు. నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, ఫయాజ్, జక్కుల వెంకటేశం, గడ్డం ప్రసాద్‌గౌడ్, అరికె సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహన డ్రైవర్ కృషి చేయాలి








### ఆత్మకూరు డిఎస్పి రామంజినాయక్

**నందికొట్కూరు, సెప్టెంబర్29, (రిపబ్లిక్ న్యూస్) :**
నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆదివారం బ్రాహ్మణకొట్కూరు గ్రామంలోని రాయల్ ఫంక్షన్ హాల్ నందు ఎస్ ఐ పూజారి తిరుపాలు ఆధ్వర్యంలో దాదాపు 300 మంది డ్రైవర్లతో రోడ్డు ప్రమాదాల నివరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆత్మకూరు డిఎస్పి రామంజినాయక్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా డిఎస్పి రామాంజీ నాయక్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు చాలావరకు అతివేగం వలన అజాగ్రత్త వలన జరుగుతుంటాయని కావున యువత ఏదైనా వాహనంపై వెళ్తున్నప్పుడు ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని, వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని మరియు వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు మరియు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని విజ్ఞప్తి చేశారు.

అతివేగం వలన ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మీ కుటుంబం నష్టపోవడం మాత్రమే కాకుండా ఎదుటివారి ప్రమాదం జరగడం వలన వారి కుటుంబం కూడా నష్టపోయే ప్రమాదం ఉంది.

మోటర్ సైకిల్ పై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించడం వలన ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాపాయ స్థితి నుండి బయటపడవచ్చు అని మరియు అతివేగంగా మోటార్ సైకిల్ పై వెళ్లకూడదని, కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలకు (మైనర్) వాహనాలు ఇవ్వడం వలన వారు ప్రమాదానికి గురి కావడంతో పాటు తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుంది. కావున చిన్న పిల్లలకి వాహనం నడిపే అవకాశం ఇవ్వకూడదని కొన్ని సూచనలు తెలియజేశారు. రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వాహనాలు నడిపే డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం ప్రమాదకరం అన్నారు. వాహనాల్లో ఓవర్ లోడుతో ప్రయాణం చేయకూడదని ముఖ్యంగా ఆటోలలో పరిమితికిమించి ప్రయాణం చేయడం వలన ప్రమాదాలు జరగవచ్చునని కావున ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని విజ్ఞప్తి చేశారు. మరియు వాహనం నడిపేటప్పుడు సెల్ ఫోన్స్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వలన ఎక్కువగా ప్రమాదాలు జరుగుతాయని కావున సెల్ ఫోన్ లో మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలు చేరాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ తో బ్రాహ్మణకోట్కూర్ ఎస్సై తిరుపాల్ డ్రైవర్లు, ప్రజలు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## దేశద్రోహులు వైయస్ జగన్ కుటుంబంను దేశ బహిష్కరణ చేయాలి

### డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి




**నందికొట్కూరు, సెప్టెంబర్29, (రిపబ్లిక్ న్యూస్) :**
నందికొట్కూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా డాక్టర్ కాకర వాడ చిన్న వెంకటస్వామి మాట్లాడుతూ పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం యొక్క ప్రసాదంలో కల్తీ జరిగిందని లేబరేటరీలో పరీక్ష నిర్వహించి ధ్రువీకరించడం జరిగింది. అదే విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు గారు ప్రస్తావించడం జరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వెంకటేశ్వర స్వామి భక్తులు కోట్లాదిమంది హిందువులు ఎంతో భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వర స్వామి ప్రసాదం స్వీకరిస్తారని అలాంటి ప్రసాదంలో జంతువుల కొవ్వు, చేప ఆయిల్, పందికొవులతో తయారు చేయబడినటువంటి నూనెలు ఉపయోగించారని ఇది ప్రపంచ దేశాలలో ఉన్నటువంటి కోట్లాదిమంది భక్తుల యొక్క మనోభావాలను దెబ్బతీసిందని, ఈ దుశ్చర్యలకు పాల్పడిన జగన్ మరియు ఈవో ధర్మారెడ్డి టీటీడీ చైర్మన్ భూమన్ కరుణాకర్ రెడ్డి ఇంకా ఈ చర్యలకు పాల్పడిన వారి పైన కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం ముందుకెళుతూ ఉంటే చంద్రబాబు నాయుడు గారు బాధ్యతతో వ్యవహరిస్తూ, హిందూ దేవాలయాల పైన పవిత్ర స్థలాల పైన వైసిపి ప్రభుత్వం చేసినటువంటి దాడులను ఖండిస్తూ వాటికి బాధ్యులైన వారిపైన చర్యలు తీసుకోవాలని రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొల్పి దేవాలయాల పవిత్రతను కాపాడేందుకు కృషి చేస్తున్నారని, మన పవిత్రమైన భారత దేశంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా 1857వ సంవత్సరం సిపాయిల తిరుగుబాటు జరిగింది దీనికి కూడా ప్రధాన కారణం ప్రధాన కారణం బ్రిటిష్ వారు తూటాలను ఆవు పంది కొవ్వులతో తయారు చేసినటువంటి వాటిని ఉపయోగించడం వల్ల ఆనాడు సిపాయిలు తిరుగుబాటు చేశారని, నేడు పవిత్రమైనటువంటి తిరుమల ప్రసాదంలో కూడా జగన్ ప్రభుత్వం జంతువుల కొవ్వు, బంధువు పందుల కొవ్వు చేపల ఆయిల్లో ఉపయోగించి అపవిత్రం చేశారని ఆనాడు జరిగిన సిపాయిల తిరుగుబాటుకు ఏ విధంగా జరిగిందో అదే విధంగా జగన్ ఇంటి పైన తన కార్యాలయాల పైన త్వరలో ప్రజలు తిరుగుబాటు చేసి రాష్ట్రం నుంచి తరిమి వేస్తారని ఆరోజులు దగ్గరలో ఉన్నాయని అన్నారు. ఇదిలా ఉంటే స్వాతంత్ర ఉద్యమాలు చేస్తూ దేశం కోసం ప్రాణాలు అర్పిస్తున్నటువంటి స్వాతంత్ర సమరయోధులు ఒకవైపు స్వాతంత్రం కోసం పోరాటం చేస్తూ ఉంటే, వైయస్ కుటుంబం మాత్రం బ్రిటిష్ వారికి కావలసినటువంటి ఆహార పదార్థాలను గొడ్డు మాంసాన్ని, పంది మాంసాన్ని సప్లై చేస్తూ బ్రిటిష్ వారికి మద్దతుగా వత్తాసు పలకడం జరిగింది. ఇలాంటి వైఎస్ కుటుంబాన్ని దేశద్రోహులుగా ప్రకటించి దేశం నుంచి తరిమి వెయ్యాలని అన్నారు. ఇలాంటి దేశద్రోహులు స్థాపించిన వైయస్సార్ పార్టీ జగన్ మరియు అతని అనుచరులు చేసినటువంటి అవినీతి అక్రమాలను చంద్రబాబు నాయుడు గారు బట్టబయలు చేశారని వారు చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడం కోసం చంద్రబాబు నాయుడు గారిని నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నటువంటి వైసీపీ కుక్కలకు బుద్ధి చెబుతామంటూ ఇప్పటికే ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పి 11 సీట్లకే పరిమితం చేసిన ఇంకా వారికి బుద్ధిని రాక చంద్రబాబు నాయుడు గారిని విమర్శిస్తున్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం 25 సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోయిందని ఆర్థిక సంక్షేమంలో కూరుకుపోయిందని ఆ ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేందుకు చంద్రబాబు నాయుడు గారు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని రాష్ట్రం అప్పులతో అధోగతి పాలు అయిన సంక్షేమ పథకాలు ఆపకుండా చంద్రబాబు నాయుడు గారు ఇచ్చినటువంటి హామీలను అమలు చేస్తూ, ప్రజా ప్రభుత్వముగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తూ, అభివృద్ధి వైపు తీసుకెళ్తూ ఉంటే, దాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు చంద్రబాబు నాయుడును విమర్శిస్తూ వారి తప్పులను కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అనడం బొత్స సత్యనారాయణ సిగ్గుచేటని బొత్స నీకు నీ జగన్ కు " ఓం నమో శ్రీ వేంకటేశాయ ఆపదముక్కులవాడా అనాథ రక్షక వెంకటరమణ గోవిందా గోవిందా" అన్న మాటలు స్పష్టంగా నీవు కానీ నీ జగన్ గాని పలకమని సవాలు విసడం జరిగింది.అన్యమతస్తులైనటువంటి వారు ఎవరైనా సరే తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే వారు ఆలయంలో డిక్లరేషన్ ఇవ్వవలసి ఉంటుంది. ఆ డిక్లరేషన్ లో వారి యొక్క మతానకు సంబంధించిన వివరాలు వెల్లడించవలసి ఉంటుంది. గతంలో ఏపీజే అబ్దుల్ కలాం గారు మరియు సోనియా గాంధీ గారు వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నప్పుడు వారు వారి మతాన్ని డిక్లేర్ చేయడం జరిగింది. కానీ వారి కంటే జగన్ గొప్పవాడా? లేక మేధావి? ఇతను మాత్రం తన మతాన్ని డిక్లరేషన్ ఇవ్వకుండా వెంకటేశ్వర స్వామిని దర్శించుకోకుండా ఉపసంహరించుకోవడం జరిగింది. జగన్ మీడియాతో మాట్లాడుతూ నా మతం మానవత్వం అని చెప్పడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంటుంది మానవత్వం అంటే అర్థం తెలియని జగన్ ఇలా మాట్లాడడం హాస్యాస్పదం సొంత చిన్నానను చంపిన వానికి మానవత్వం ఉంటుందా? దళితులను బీసీలను మహిళలను మైనారిటీలను ఎంతోమందిని పొట్టన పెట్టుకున్న జగన్కు మానవత్వం గురించి మాట్లాడే అర్హత లేదని ఇంకా మానవత్వం గురించి ఇతను మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. ఇలాంటి అన్య మతస్థుడు హిందూ దేవాలయాలను హిందూ దేవుళ్ళ పైన విషం చంపుతూ దేవాలయాలను విగ్రహాలను ధ్వంసం చేస్తూ గత ఐదు సంవత్సరాలు పరిపాలన కొనసాగించాడు. ఇతని పార్టీలో ఉన్నటువంటి ధారా సుధీర్ అనే వ్యక్తి నందికొట్కూరులో వివిధ గుల్లను సందర్శించి జగన్ ఉత్తముడు, ప్రసాదంలో ఎలాంటి కల్తీ జరగలేదు, చంద్రబాబు నాయుడు గారు తప్పుడు ప్రచారం చేస్తూ జగన్ పైన అపవాదు వేస్తున్నాడని, చంద్రబాబు నాయుడు గారిని విమర్శించాడని అతనికి చంద్రబాబు నాయుడును విమర్శించే అర్హత లేదని అతను ఒక డాక్టర్ కదా తన పేషెంట్లకు పరీక్షలు ల్యాబ్లో నిర్వహించకుండా ట్రీట్మెంట్ ఇస్తాడా? అసలు అతను కానీ అతడు అనిస్థీసియ డాక్టర్ మోకాలు నొప్పుల చికిత్స చేస్తున్నాడు ఈ విషయం పేషెంట్లకు తెలిస్తే ఏమవుతుందో అతడి ఆలోచించుకోవాలి. ఈ వైసీపీ నాయకులు అందరూ కల్తీ గాళ్లేనని, ఉగాది, సంక్రాంతి పండుగ ముందర పగటి వేషగాళ్ళు వచ్చి తమ కడుపు నింపుకొని వెళుతూ ఉంటారు. అలాగే ఇంతవరకు కనిపించని ధారా సుధీర్ కూడా తన పబ్బం గడుపు కోవడం కోసం నందికొట్కూరు కొచ్చి చంద్రబాబునాయుడు గారి పైన నోరు పారేసుకుంటే చూస్తూ ఊరుకునేది లేదని తగిన బుద్ధి చెబుతామని మీ నాయకుడి కులము మరియు గోత్రము కల్తీనని, అతని అనుచరులైన మీరు కూడా కల్తీగాళ్లేనని మీకు చంద్రబాబును విమర్శించే స్థాయి లేదని ఒళ్ళు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరించడం జరిగింది. కొడాలి నాని పేర్ని నాని మొన్న వీరిరువురు తిరుపతి లడ్డులో కల్తీ జరగలేదని జగన్ స్వచ్ఛమైన పాలన అందించాడని చంద్రబాబు గారిని విమర్శించడం జరిగింది. ఒరేయ్ బుద్ధిలేని ఎదవల్లారా మీరు ఇప్పటికైనా మారండి రా జగన్ ఎలాంటి రాక్షసుడు తెలుసుకోండి రా మతాల మధ్యన, కులాల మధ్యన చిచ్చుపెట్టి రాష్ట్రాన్ని అల్లకోల్లోలం చేసే పరిస్థితికి దిగజారుస్తూ ఉన్నాడు. తెలుగు ప్రజలంతా ఏకమై మీకు బుద్ధి చెబుతారని మీరు ఇంకా తప్పుడు మాటలు మాట్లాడితే మీ నాలుకలు కోస్తామని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ ఎస్ అబ్దుల్ సుకూర్ పట్టణ టిడిపి నాయకులు బంగారు వెంకటేశ్వర్లు,కొత్తపల్లి మండల నాయకుడు కర్నాటి శివారెడ్డి, శీలం నాగరాజు జూపాడుబంగ్లా నాయకులు పరిగె సుంకన్న, మరియు తెలుగు యువత నాయకులు రాజేష్, వంశీ , శ్యామ్, ఖజా వలి, తదితర నాయకులు పాల్గొన్నారు

## 8 మంది రెబల్స్‌పై బీజేపీ వేటు

**ఛండీగఢ్ సెప్టెంబరు 29 (రిపబ్లిక్ న్యూస్) :** హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో రెబల్స్ బెడద బీజేపీ కి సైతం తప్పలేదు. ఎనిమిది మంది తిరుగుబాటు నేతలను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు బీజేపీ ఆదివారంనాడు ప్రకటించింది. వీరిలో ఇద్దరు మాజీ మంత్రులు కూడా ఉన్నారు. అక్టోబర్ 5న జరుగనున్న ఎన్నికల్లో వీరంతా స్వంతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగడంతో పార్టీ ఈ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఆరేళ్ల పాటు వీరిని పార్టీ నుంచి బరిష్కరిస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మోహన్ లాల్ బదోలి ప్రకటించారు. తక్షణం ఆ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు తెలిపారు.

పార్టీ బహిష్కరణ వేటుపడిన మాజీ మంత్రుల్లో రంజిత్ చౌతాలా, సందీప్ గార్గ్ ఉన్నారు. తనకు టిక్కెట్ నిరాకరించడంతో రంజిత్ చౌతాలా పార్టీని విడిచిపెట్టగా, ముఖ్యమంత్రి నయబ్ సింగ్ సైనిపై సందీప్ గార్గే పోటీకి దిగడంతో ఆయనపై వేటుపడింది. తక్కిన వారిలో అస్సాంథ్ సీటులో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన రామ్ శర్మ, గనౌర్ నుంచి పోటీలో ఉన్న దేవేందర్ కద్యాన్, సఫిడో నుంచి బరిలో ఉన్న మాజీ మంత్రి బచన్ సింగ్ ఆర్య, మెహం నుంచి పోటీ చేస్తున్న రాధా అహ్లావత్, గురుగావ్ నుంచి పోటీ పడుతున్న నవీన్ గోయెల్, హథిన్ నుంచి పోటీలో ఉన్న కెహర్ సింగ్ రావత్ ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 1న జరగాల్సిన హర్యానా అసెంబ్లీ ఎన్నికలు వివిధ పార్టీల విజ్ఞప్తి మేరకు అక్టోబర్ 5వ తేదీకి ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది. హర్యానాతో పాటు జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను అక్టోబర్ 8న ప్రకటిస్తారు.



## ఉదయనిధి స్టాలిన్‌పై పురందేశ్వరి ధ్వజం



**అమరావతి సెప్టెంబరు 29 (రిపబ్లిక్ న్యూస్) :**
తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలను ఏపీ బీజేపీ చీఫ్ పురం దేశ్వరి తప్పుబట్టారు. ఈమేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. సనాతన ధర్మాన్ని నిర్మూలిం చే వరకు విశ్రమించమని చెప్పిన ఉదయనిధి స్టాలిన్ పార్టీతో కాంగ్రెస్ అంటకాగుతుందని ఆరోపించారు. సనాతన ధర్మంపై ఆయన గతంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని.. ఇండియా కూటమి మాత్రం ఆయన ను తమిళనాడు ఉప ముఖ్యమంత్రిగా నియమించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ తీరును తప్పుబడుతూ ఆయన వ్యాఖ్యల వీడియోను ట్విట్టర్‌లో పురందేశ్వరి పోస్ట్ చేశారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com